




## *అమెరికాకమ్మ కథలు -2*

# మరో సాహితీ సదస్సు- డాలర్ల వేట

వారం రోజుల క్రితం లాస్ వేగస్ నగరంలో ఒకానొక తంటా సంఘం వారి బోర్డ్ ఆఫ్ ట్రస్టీస్ మీటింగు జరిగింది. ఆ సంఘం ట్రస్టీలలో నేను ఒక ఆటాలో..సారీ ఆటలో అరటిపండుని. వెళ్ళక తప్పదు కదా. ఈ ట్రస్టీ అనే మాట నాకు ఎప్పుడూ అర్థం అవలేదు. ఎందుకంటే, ఇంగ్లీషులో ట్రస్ట్ అంటే తెలుగులో నమ్మకం. ఆ నమ్మకాన్ని నిలబెట్టే మానవుడే ట్రస్టీ .... అసలు, పిసలు గొడవంతా ఈ ట్రస్టీ గాడిని...అంటే నన్ను... మిగతా ట్రస్టీ గాళ్ళు నమ్మకపోతే నా దృష్టిలో వాళ్ళందరూ "మిస్ ట్రస్టీ" గాళ్ళనమాట. ఇక్కడ "మిస్" అంటే పెళ్ళీ, పెటాకులూ కాని అందమైన అమ్మాయి అని ఎవరైనా అపోహ పడితే , ఆ అపోహ మీద నాకు బొత్తిగా ట్రస్ట్ లేదు. " స్టీం ఇంజన్" అనేమాటకి "ధూమ శకట యంత్రం". లేదా" ఈ మెయిల్" అనే మాటకి "విద్యుల్లేఖ" టైపులో "మిస్ ట్రస్టీ" లని ప్రయివేటుగా శుద్ధ తెలుగులో పిల్చుకోవాలి అనుకుంటే "దొంగ వెధవ" అనే మాట సరిగ్గా అతుకుతుంది అని నా ట్రస్ట్.... తెలుగు భాషలో ఇక్కడ నాకు మరొక సమస్య ఉంది. అదేమిటంటే ఆడవారిలో కూడా "మిస్ ట్రస్టీలు" ఉందురు కావున వారిని శుద్ధ తెలుగులో ప్రైవేటుగా ఏ విధముగా పిల్చుకోవలయునూ?

గతంలో నేను అనేక సార్లు లాస్ వేగస్ వెళ్ళినప్పుడల్లా వేల కొద్దీ డాలర్లు సంపూర్తిగా గుండు చేయించుకున్నాను. లక్కీ ఇన్ కార్డ్స్, అన్‌లకీ ఇన్ లవ్ అనే సూక్తి మన కేసులో పూర్తిగా రివర్స్. అందు వలన ఈ సారి మా హ్యూస్టన్‌లోనే తైవాను మంగలి షాపులో ముందుగానే కేవలం అక్షరాలా డాలర్ నైన్‌టీనైన్ కే గుండు చేయించుకున్నాను. చేయించుకుని, ఒక్క ఎక్ట్రా డాలరు కూడా జేబులో పెట్టుకోకుండా హ్యూస్టన్ విమానాశ్రయంలో కూచుని, నా లాపు టాపు కంప్యూటర్‌తో ఫిబ్రవరి 14, 15, 16వ తారీకులలో జరగబోయే రెండవ ప్రపంచ తెలుగు సాహితీ సదస్సు, అందులో ముఖ్యంగా తెలుగు కథ శతవార్షికోత్సవాలు మరియు మొట్టమొదటి తెలుగు మహిళా రచయిత్రుల సమ్మేళనానికి "వ్యూహ రచన" చేస్తున్నాను. ఈ సదస్సు నిర్వహణకీ, తలపెట్టిన 800 పేజీల చారిత్రాత్మకమైన "20వ శతాబ్దంలో అమెరికా తెలుగు కథానిక" పుస్తక ప్రచురణకీ కావలసిన పది వేల డాలర్లు ఎక్కడ, ఎలా సంపాదించాలా అనే తాపత్రయానికి నేను పెట్టుకున్న పేరే "వ్యూహ రచన" అంటే. అనేక సంవత్సరాల వ్యూహ రచనల అనుభవంతో నేను నేర్చుకున్నది ఏమిటంటే, వెయ్యి డాలర్లు డొనేషన్ ఇచ్చే తస్మదీయులని బతిమాలడానికి అరగంట కూడా పట్టదు. అదే అస్మదీయులనుంచి పాతిక డాలర్లు సంపాదించడానికి ఆరేళ్ళు పడుతుంది. ఈ వివరాలన్నీ నా ల్యాపు టాపులో ఉన్నాయి. ఈ రోజు పరిస్థితి ప్రకారం, ఈ కార్యక్రమాల నిర్వహణకి మా ఇల్లు తాకట్టు పెట్టే పరిస్థితిలో ఉన్నాను.

అన్నట్టు, ఈ లాప్‌టాప్ అనే మాటకి తెలుగులో ఏమనాలో నాకు బొత్తిగా తెలియదు. "వంట్లో పెట్టుకునే" లేదా, "తొడల పైన చతికిల పెట్టే" " ఇలా ఎన్ని రకాలుగా తంటాలు పడినా నాకు అదోలాగానే ఉన్నాయి ఆ అనువాదాలు. ఎటొచ్చీ లాపు టాపు అనే ఇంగ్రేజీ మాటే అజంతమైన తెలుగు భాషలో హత్తుకు పోయింది. కాబట్టి నేను ఊహించిన మిగిలిన మాటలన్నీ తెలుగు సినిమా పాటలలా ద్వంద్వార్థాలు వచ్చి మా క్వీన్ విక్టోరియా నా టాపు లేపుట జరుగును కాబట్టీ నేను లాపుటాపు అనే మాటనే వాడతాను..

అలా నేను లాపు టాపు వాడుతుండగా, గుజరాతీ వాడిలా ఉండే ఒకనొక పవిత్ర భారతీయుడు నన్ను దూరం నుంచి చూసి దగ్గరకి వచ్చి నా పక్క కుర్చీలో కూచున్నాడు. అదే పాతికేళ్ళ క్రితం అయితే తోటి పవిత్ర భారతీయుడు ఆమడ దూరంలో కనపడగానే పరిగెట్టు కెళ్ళి కావిలించుకునే వాణ్ణి. ఎందుకంటే వాడు కూడా ఎనిమిది డాలర్ల బాపతే కదా! ఇటీవల సిస్టం మారిపోయి, పాతికేళ్ళ వాడు కూడా దొంగ హెచ్ వన్ వీసా సంపాయించుకుని 80 కే...జీతంతో కులుకుతూ ఉంటే నేను కుళ్ళి పోతూ అలాటి వాడి మొహం కూడా చూడకూడదని నిశ్చయించుకున్నాను. వారు కూడా నాబోటి వారు అమెరికా అసలు ఎందుకు వచ్చారా, యూస్‌లెస్ ఫెలోస్ అనుకుంటూ మా ఎనిమిది డాలర్ల ఓల్డ్ గేంగ్ కేసి చూడనే చూడరు. అలాటిది మధ్యాహ్నంలో ఉన్న ఈ మానవుడు - అంటే తను కుర్రాడా, ముసలాయనా అని తేల్చుకోలేని వయసులో ఉన్నాయన సాక్షాత్తూ నా పక్క కుర్చీలో కూచోడం కించిత్తు ఆశ్చర్యం మదీయ మనంబున గోచరించినది. ఇతను కూడా తన ఎలక్ట్రానిక్ చిత్తా ..అంటే తన తాలూకు లాపు టాపు విప్పుతున్నాడేమో అనుకున్నాను కానీ తరవాత జరిగిన విషయం తల్చుకుంటే ఇప్పటికీ నా మనసు తబ్బిబ్బవుతున్నది.

"ఎలా ఉన్నారు సార్?, ఎక్కడికి వెడుతున్నారూ? " అవి ఆయన మొదటి ప్రశ్నలు.

"ఓ మీరు తెలుగా?" అని అసంకల్పిత ప్రతీకార చర్యగా , అనేసి వెంటనే నాలిక కరుచుకున్నాను. ఎందుకంటే ఆఫ్టరాల్, ఈయన శుద్ధ తెలుగులోనే నా యోగ క్షేమమూ, మరియు నా ప్రయాణ విశేషాలూ అడిగాడు కదా!. దాని టీకా, తాత్పర్యం ఆయన తెలుగు శాల్తీ అనే కదా! ఇంకా నయం "మీరు ఇండియన్నా లేక గుజరాతీలా?" అని అడిగాను కాదు. పరువుపోయేది.

" అనుకోకుండా మిమ్మల్ని ఇక్కడ కలుసుకోడం, అయాం వెరీ హేపీ" అని "మిమ్మల్ని చాలా కాలంగా ఒక ప్రశ్న అడగాలి అనుకుంటున్నాను సార్...కానీ....కానీ." అని నసిగాడు మదీయ వదనారవిందం గమనిస్తూ.". మనం కూడా పరిచయం చేసుకోవాలి కదా అని నా ప్రవర.....అంటే మా కుటుంబీకుల ఋషిక్రమమూ, గోత్రమూ, జాతకమూ చెప్పబోతుంటే "భలే వారే సార్? మీ గురించి నాకు అంతా తెలుసు.... కాని ...కానీ" అని మళ్ళీ నసిగాడు. వెంటనే నా మొహం వెలిగిపోయింది. ఎందుకంటే ఈ మధ్యనే నేను వరల్డ్ ఫేమస్ అయిపోయిన ఫీలింగ్ చాలా సార్లు వస్తోంది. ఎందుకంటే మొన్ననే అంబాజీ పేట నుంచి "మొన్న మీరు పోలీస్ ఇనస్పెక్టర్‌గా నటించిన టీవీ సీరియల్ చూశాను. మీ తెలుగు ఏక్సెంట్ వింటుంటే మా పురోహితుడుగారు పోలీసు వేషం వేస్తున్నట్టుగా ఫీలయ్యాను. ఈ మధ్య అటువంటి భాష టీవీలో వినడం అలవాటు లేక మీ డైలాగులు అర్థం అవడానికి కొంచెం టైము పట్టినది." అనుకుంటూ రాశాడు. ఆయన నన్నూ, నా భాషనీ తిట్టాడో, పొగిడాడో తెలియ లేదు కానీ నా ఈ మెయిల్ అడ్రెస్ ఎలాపట్టుకున్నాడో తెలియక, నేను ఖచ్చితంగా కనీసం అంబాజీ పేటలో అయినా ఫేమస్ అని కనిపెట్టేశాను. కానీ, నా పక్క కుర్చీ తాలూకు మానవుడు రెండు సార్లు "కానీ" అని నా మొహాన్ని అదోరకంగా వీక్షించడం అదోలా ఉంది.

"అబ్బే, మీరు ఏమీ అనుకోనంటేనే..." రెట్టించాడు ఆ మహాశయుడు. నేను ఏమనుకున్నా, లేకపోయినా ఈయన నా పక్కన బాగానే పదిలంగా కూర్చున్నాడు కాబట్టి "అడగండి. పరవాలేదు" అని నోరుజారాను.

"మీ క్వీన్ విక్టోరియా గారు నిజంగానే అంత కోపంగా ఉంటారా మీరంటే?".

అనుకోని ఈ ప్రశ్నకి నిజంగానే ఆశ్చర్య పోయి, మొహం ఎలా పెట్టాలో తెలియక అదోలా పెట్టి, "అరే! ఆవిడ కోపంగా ఉంటారని మీకెలా తెలుసూ? అని మళ్ళీ నోరుజారాను.

"అబ్బే, మీరు పాతికేళ్ళగా రాసినవి చదువుతున్నాను లెండి. చాలా సార్లు కథల్లో ఆవిడ మిమ్మల్ని అర్థరాత్రి టెంకిజల్ల కొడుతూ ఉంటారు కదా, పైగా అద్దంలో మీ మొహం చూసుకో మని పదే పదే ఇన్సల్టు చేస్తారు కదా...అందుకూ!" అన్నాడు ఆ మానవుడు జాలిగా.

ఉన్నమాట చెప్పొద్దూ. ఆయన అలా అనగానే నాకు ఏం చెయ్యాలో ఏం చెప్పాలో తెలియ లేదు. ఎందుకంటే నిజానికి మా క్వీన్ విక్టోరియా మాంచి చమత్కారం ఉన్న మనిషి. ఉదాహరణకి, వారం రోజుల క్రితం నేను హాయిగా లైట్లు అన్నీ ఆర్పేసి, అర్థరాత్రి ముసుగుతన్ని నిద్ర పోతుంటే, మా ఆవిడ హఠాత్తుగా వచ్చి, లైటు వేసేసి "ఏమిటీ? నిద్రే?" అని అడిగింది. నన్ను ఆ పొజిషన్‌లో చూసిన ఒబామా కానీ, వారి సతీమణి మిషెల్ గారు కానీ, మరింకెవరైనా కానీ, నేను నిద్ర పోతున్నాను అనుకుంటారు కానీ, గాయత్రీ జపం చేస్తున్నాను అని అనుకోరు కదా! మరి ఆ ప్రశ్న ఆవిడ సెన్స్ ఆఫ్ హ్యూమర్ మరియు హై లెవెల్ అబ్జర్వేషన్ పవరూ కాక మరింకేమిటీ? ఇలాంటివే హాస్యప్రధానమైన సీన్లు మా జీవితంలో చాలా ఉన్నాయి. ఇలాటివన్నీ చెప్పి, మా ఆవిడ కోపిష్టి కాదనియూ, పైగా చాలా హాస్యప్రియురాలనియూ ఈయనకి చెప్పి, మెప్పిద్దామనుకునే లోపుగా మా విమానం వచ్చేసినట్టు అనౌన్స్‌మెంట్ వచ్చేసింది. "నైస్ మీటింగ్యూ, మళ్ళీ కలుసుకున్నప్పుడు మా సంసారం గురించి మిగిలిన రహస్యాలు కూడా చెప్తాను" అని నేను పరిగెత్తుకుంటూ విమానం ఎక్కేశాను.

మర్నాడు గ్రాండ్ బాల్ రూం లో బోర్డు మీటింగ్‌కి వెళ్ళి నాకు కేటాయించిన ట్రస్టీ సీటులో నెర్వస్‌గా బైఠాయించిన నన్ను వెనకాలనుంచి ఎవరో భుజం తట్టారు. వెనక్కి తిరిగి చూడగానే ముచ్చెమటలు పట్టేశాయి, "సారీ సార్, నిన్న ఎయిర్ పోర్ట్‌లో మనసువిప్పి మాట్లాడలేకపోయాను. అన్నట్టు, ఇదిగో మీకు ఎప్పటినుంచో పంపిద్దామనుకున్న చిన్న డొనేషన్." అని ఒక కవరు నా చేతిలో పెట్టి ....అవును...నా పక్క సీటులోనే బైఠాయించాడు ఒకానొక తస్మదీయ మానవుడు. నాకు ఊరూ, పేరూ తెలియని ఈయన ట్రస్టీయా, మిస్ ట్రస్టీయా అని ఎలా తెలుసుకోవాలీ, అసలు అది అవసరమా అని వెంఠనే ఫోన్ చేశాను.

"నువ్వు చేసే వెధవ యూస్ లెస్ పనులకి మోసపోయి వెయ్యి డాలర్లు డొనేషన్ ఇచ్చాడుగా. అనుభవించు. దేనికైనా ఓటు కావాలేమో కనుక్కుని వేసెయ్" అని ఫోన్ కట్ చేసింది మా క్వీన్ విక్టోరియా.

